క్లుప్తంగా

నేడు బల్లుకోట రోడ్డు ప్రారంభం

కురుపాం: మండలంలోని బల్లుకోట గిరిజన గ్రామానికి వెళ్లే రహదారిని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతులమీదుగా సోమవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎంపీడీఓగా ఉమామహేశ్వరి

పాలకొండ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.ఉమామహేశ్వరి ఆదివారం నియమితులయ్యారు. ఈమె పాచిపెంట ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇదివరకు ఈ స్థానంలో విధులు నిర్వహించిన దొంక త్రినాథులు సూపరింటెండెంట్‌గా స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా..


వద్దాది శ్రీసూర్య గుణ్వంత్


మజ్జి యువరాజ్ నాయుడు

వీరఘట్టం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వీరఘట్టంకు చెందిన వద్దాది శ్రీసూర్య గుణ్వంత్ ఓపెన్ కేటగిరీలో 2348వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 235వ ర్యాంకు సాధించాడు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలనేది తన కోరికగా తెలిపాడు. అలాగే వీరఘట్టంకు చెందిన మరో విద్యార్థి మజ్జి యువరాజ్ నాయుడు ఓపెన్ కేటగిరీలో 8088, ఓబీసీ కేటగిరీలో 1793వ ర్యాంకు సాధించాడు. పోలీస్ ఆఫీసర్ కావాలనేది తన లక్ష్యంగా పేర్కొన్నాడు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

సీతంపేట: డిగ్రీలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గతేడాదిలాగే ఈ ఏడాది కూడా ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్ ప్రక్రియ చేపట్టనుంది. ఇంటర్మీడియట్‌లో వివిధ గ్రూపుల్లో ఉత్తీర్ణత సాధించిన వారంతా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హులు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చేనెల 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 26 నుంచి 30 వరకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్ల ద్వారా కాలేజీలను ఎంచుకోవాల్సి ఉంటుంది. జూలై 3న సీట్ల కేటాయింపు ఉంటుంది. తొలివిడత అడ్మిషన్ ప్రక్రియ పూర్తయ్యాక తుది దశ ప్రారంభం కానుంది. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితర స్పెషల్ కేటగిరి కోటా కింద దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని వీఎస్ కృష్ణాకాలేజీ వేదికగా ఈనెల 21 నుంచి 23 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.

చురుగ్గా కల్వర్టు పనులు


షుల్జిపేట వద్ద జరుగుతున్న కల్వర్టు పనులు

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలోని షుల్జిపేట ప్రజలకు వరదనీటి ఇబ్బందులు నుంచి కొంత ఉపశమనం కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో చెరుకుపల్లి గెడ్డ వరద ఉధృతికి షుల్జిపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో 15వ ఆర్థిక సంఘ నిధులు సుమారు లక్ష రుపాయలతో కల్వర్టు పనులు చేపడుతున్నారు. కల్వర్టు పూర్తయితే వర్షాకాలంలో వరద నీటి ఇబ్బందులు కొంతమేర తొలగుతాయని ప్రజలు తెలుపుతున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా రూరల్ పోలీస్ స్టేషన్ భవనం


పూర్తయిన రూరల్ పోలీస్ స్టేషన్ భవనం

సాలూరు: పట్టణ శివారు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన రూరల్ పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సుమారు కోటీ 85 లక్షల రూపాయల వ్యయంతో భవనం నిర్మించారు. మరికొద్ది రోజుల్లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ భవనాన్ని ప్రారంభిస్తారని పోలీస్ సిబ్బంది తెలిపారు.

ఆకట్టుకున్న యోగాసన పోటీలు

రాజాం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వికాస తరంగిణి కార్యాలయంలో ఆదివారం చేపట్టిన యోగాసన పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి తదితర మండలాల నుంచి పలు గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా గడే అప్పలనాయుడు, మురపాక గణేష్, కొరికాన శ్రీనివాసరావు, అల్లాడ భాస్కరరావు, గెడ్డాపు శ్రీలక్ష్మి, వాకచర్ల పైడిరాజు వ్యవహరించారు.

టీకాయే శ్రీరామరక్ష

- పశువ్యాధులపై అప్రమత్తత అవసరం
- సకాలంలో టీకాలు వేయించడంతో వ్యాధుల నుంచి రక్షణ
- పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రభా మాణిక్యరావు సూచనలు


ప్రభా మాణిక్యరావు, ఏడీ పశుసంవర్ధక శాఖ, పాలకొండ

పాలకొండ రూరల్: లేగదూడలకు ప్రస్తుత సీజన్‌లో గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వంటి ప్రమాదకరమైన అంటువ్యాధులు సోకి ప్రాణ నష్టం కలిగిస్తాయి. కాబట్టి ఈ వ్యాధులు సోకక ముందే నివారణగా టీకాలు వేయించడం అవసరమని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు(ఏడీ) ప్రభా మాణిక్యరావు సూచించారు. లేగదూడలకు సోకే అంటువ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, టీకాలు అందించే సమయంలో పాటించాల్సిన నియమాలను వివరించారు.

అంటువ్యాధులు సోకిన లేగదూడలను సకాలంలో అధిక వ్యయంతో చికిత్స చేయించినా అవి బ్రతికి బయట పడే అవకాశాలు చాలా తక్కువ. ముఖ్యంగా లేగదూడల్లో గాలికుంటు వంటి వ్యాధులు సోకినపుడు అవి శక్తిని కోల్పోయి, నీరసించిపోతాయి. కోలుకునేందుకు దాదాపు 6 మాసాల వరకు సమయం పట్టొచ్చు. గొంతువాపు, చీడపారుడు, దొమ్మ వంటి అంటువ్యాధులు సోకిన లేగదూడల్లో మరణాల శాతం అధికంగా ఉంటుంది. జబ్బవాపు వ్యాధి సోకిన పశువుల్లో కండరాలు క్షీణించడం ద్వారా సరిగా నడవలేక, నిరుపయోగమవుతాయి. పడ్డలు, పెయ్యలు చూలికట్టి, ఈనే సమయంలో బ్రూసెల్లోసిస్ వ్యాధి ప్రభావం వల్ల గర్భస్రావాలు సంభవించి, రైతులకు నిరాశ, నిస్పృహలు కలిగిస్తాయి. అలాగే థైలేరియాసిస్ వ్యాధి చికిత్సకు అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. కాబట్టి చికిత్స కంటే నివారణే ముఖ్యమని పాడి రైతులు గమనించాలి.

వైద్యుల సలహాల మేరకు..

ఉచితంగా లేదా తక్కువ ఖరీదుతో లభ్యమయ్యే టీకాలను లేగదూడలన్నింటికి వేయించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలి. టీకాలు వేయించేముందు లేగదూడలన్నింటికీ అంతర్ పరాన్నజీవుల నిర్మూలన మందులు తాగించాలి. టీకాలు నిల్వ ఉన్న సమయం, మోతాదు, పశువుల ఆరోగ్య పరిస్థితి వంటి విషయాల్లో వైద్యుల సలహాలు తీసుకోవాలి. టీకాలు వేయించడం వలన లేగదూడల్లో జ్వరం, దాణా తినకపోవడం, టీకాలు వేసిన స్థలంలో వాపు ఏర్పడడం వంటి స్వల్పదుష్ఫలితాలు ఒక్కోసారి సంభవించినప్పటికి కంగారుపడాల్సి అవసరం లేదు. లేగదూడల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని టీకాలు వేయించి ప్రాణాంతకమైన అంటువ్యాధుల నుండి రక్షించుకోవాలన్నారు. బ్రూసెల్లోసిస్ తప్ప మిగతా టీకాలన్ని ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా వేయిస్తుండాలి.

గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు రెండింటి నివారణకు 'రక్షబయోవాక్' పేరుతో ఒకే టీకా మందు అందుబాటులో ఉంది. అలాగే గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి మూడింటి నివారణకు 'రక్షట్రయోవాక్' పేరుతో ఒకే టీకామందు మార్కెట్లో లభిస్తుంది. ఈ టీకాను మొదటిసారి నాలుగు మాసాలకు, ఆ తర్వాత తొమ్మిది మాసాలకు బూస్టర్ డోస్ వేయించాలి. ఇలా చేస్తే పై రెండు మూడు వ్యాధులు సోకకుండా ఉంటాయని తెలిపారు.


దూడలకు నోటిద్వారా టీకాలు వేస్తున్న పశువైద్యులు


సమతుల ఆహారం పెట్టాలి..

చూలుతో ఉన్న పశువులకు చివర మూడు మాసాలు పుష్టిగా సమతులాహారం అందించడం వల్ల పుట్టిన లేగదూడలు అధిక శరీర బరువు కలిగి ఉండి, ధృడంగా ఆరోగ్యంగా ఉంటాయి. పుట్టిన దూడలకు సమృద్ధిగా జున్నుపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. టీకాలు వేయించడంతో పాటు, వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించి చికిత్స అందించడం చాలా ముఖ్యం.

లేగదూడల్లో టీకాల నియమావళి..

వ్యాధి	టీకాలు వేయించాల్సిన వయస్సు	బూస్టర్‌డోస్
గాలికుంటు	1-2 మాసాలు	30-40 రోజుల తర్వాత
గొంతువాపు	5వ మాసం	30-40 రోజుల తర్వాత
జబ్బవాపు	6వ మాసం	30-40రోజుల తర్వాత
బ్రూసెల్లోసిస్	4-8 మాసాలు	-
థైలేరియాసిస్	4వ మాసం	-
దొమ్మవ్యాధి	7వ మాసం	-
శ్వాసకోశవ్యాధి	1-1/2 మాసం	3 మాసాలు

● ఆకట్టుకున్న వర్ణచిత్రం



గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు ఫాదర్స్ డే సందర్భంగా వేసిన వర్ణచిత్రం ఆకట్టుకుంది. కుటుంబంలో తండ్రి పాత్రను తెలియజేసేలా వేసిన ఈ చిత్రం పలువురిని ఆలోచింపజేసింది. - గరుగుబిల్లి

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు


నేరడి ఆర్‌బీకేలో యూరియా బస్తాలు దించుతున్న కార్మికులు

భామిని: ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు రైతుభరోసా కేంద్రాలకు వచ్చి చేరాయి. మండలంలోని 16 ఆర్‌బీకేల పరిధిలో రైతుల అవసరాల మేరకు ఎరువులకు ఇండెంట్లు పంపగా.. అంచెలంచెలుగా ఎరువులు వస్తున్నాయని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ప్రతీ ఆర్‌బీకేలో 400 బస్తాల యూరియా, 250 బస్తాల డీఏపీ చొప్పున వచ్చాయన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి ఎరువులు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కురుపాం: స్థానిక మహాత్మా జ్యోతీబా పూలే వెనుకబడిన తరగతుల బాలురు గురుకుల పాఠశాలలో 6,7,8,9వ తరగతుల్లో మిగులు సీట్లకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పాఠశాలలో ఖాళీగా ఉన్న 62 సీట్లకు గాను 84 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 72 మంది ప్రవేశ పరీక్షకు హాజరుకాగా, 14 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ తెలిపారు.

వాహనం బోల్తా..


బోల్తాపడిన వ్యాన్

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి కూడలి వద్ద విత్తనాలతో వస్తున్న వ్యాన్ బోల్తాపడింది. వీరఘట్టం నుంచి పాలకొండ వస్తున్న ఈ వ్యాన్ మలుపు వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి ప్రమాదానికి గురైయ్యింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద ఘటనలో వాహనంలో ఉన్న విత్తన బస్తాలు రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సహకారంతో రోడ్డుపై పడిన బస్తాలను తొలగించారు.

చురుగ్గా హెల్త్ సర్వే


హెల్త్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

భామిని: ప్రతీ ఇంట్లో జ్వరాలు, అనారోగ్య బాధితుల వివరాల సేకరణకు ఆరోగ్య సిబ్బంది హెల్త్ సర్వే చేపడుతున్నారు. బాలేరు పీహెచ్‌సీ పరిధిలోని ఎం.కె.రాజపురంలో ఆదివారం హెల్త్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఆ వివరాలను ఎన్‌సీడీసీపీ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

తారెత్తిస్తున్న ఎండలు


నిర్మానుష్యంగా ఉన్న వీరఘట్టం ప్రధాన రహదారి

వీరఘట్టం: గత పదిరోజులుగా ఎండ తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండ వేడితో పాటు వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తారెత్తిస్తుండడంతో ప్రజలు వీధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే వీరఘట్టం ప్రధాన రహదారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జనసంచారం లేక బోసిపోయింది.

భామిని: మండలంలో ఆదివారం విపరీత పరిస్థితులు నెలకొన్నాయి.

ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు.మధ్యాహ్నం ఆకాశంలో మబ్బులు రావడంతో వాతావరణం కాస్త చల్లబడింది. వర్షం కురుస్తుందని అంతా భావించినా వరుణుడు కరుణించలేదు.

అన్నివర్గాలకు మేలు జరిగేలా పాలన


తోటపల్లిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- 98 శాతం హామీలు అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దే..
- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ.. అన్ని వర్గాలకు మేలు చేకూరేలా పరిపాలనను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని తోటపల్లి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన లబ్ధిపత్రాలను అందజేశారు. అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం ఆ పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు జన్మభూమి కమిటీ సభ్యులు ప్రతిపాదించిన వారికి మాత్రమే పథకాలు అందేవని గుర్తుచేశారు. టీడీపీ మోసపూరిత రాజకీయాలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రతీ ఒక్కరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల ముంగిటకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తూ, ప్రజా క్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, రోజురోజుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక పచ్చమీడియా ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, స్థానిక సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, నాయుకులు ఆవాల కన్నయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వీరఘట్టం ఎస్సై బదిలీ

వీరఘట్టం: స్థానిక ఎస్సై ఎం.హరికృష్ణకు శ్రీకాకుళం బదిలీ అయింది. ఈయన 2021 డిసెంబర్ 10న వీరఘట్టం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. శనివారం రాత్రి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

బహిరంగ మద్యపానం నేరం

పాలకొండ రూరల్: బహిరంగ మద్యపానం నేరమని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పట్టణంలో సీతంపేట, వీరఘట్టం రోడ్డులో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై అపరాద రుసుం విధించారు. కొందరిపై కేసులు నమోదు చేశారు. వాహనచోదకులు రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

పాలకొండ రూరల్: భగవంతుని చేరుకునేందుకు సేవే మార్గమని ఆధ్యాత్మిక వక్త ఎ.కామేశ్వరరావు అన్నారు. మండలంలోని జెజ్జి గ్రామంలోని రామ మందిరంలో ఆదివారం సత్సంఘ కార్యక్రమం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలు, వాటి అర్థాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడచుకోవాలని సూచించారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వక్తలు హరికృష్ణ, మోహన్‌దాసు, సత్యంనాయుడు, మాజీ జెడ్పీటీసీ ఎస్.దామోదరరావు తదితరులున్నారు.

సూక్ష్మసేద్యంతో సాగునీరు ఆదా

రేగిడి: సూక్ష్మసేద్యంతో సాగునీటిని ఆదా చేయవచ్చని, అందుకే నీటివనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో బిందుసేద్యం, తుంపరసేద్యం అమలు చేస్తున్నామని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని మునకలవలస గ్రామంలో పలువురు రైతులకు అందించిన స్ప్రింక్లర్ పైపులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూక్ష్మసేద్యం విధానంలో భాగంగా రైతులకు 55 శాతం, 90 శాతం రాయితీతో ఈ పైపులు అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇవి కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్‌రావు, మైక్రో ఇరిగేషన్ అధికారిణి శ్రీలత, బిజినెస్ సీఈఓ సుపేష్, వీఏఏ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం..

- ఎ. వెంకంపేట రామాలయం వీధిలో సీసీ రోడ్డు


ఎ.వెంకంపేటలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

మక్కువ: మండలంలోని ఎ.వెంకంపేట రామాలయం వీధి రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రామంలోని రామాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న రోడ్డు చిన్న వర్షానికి కూడా చిత్తడిగా మారుతోంది. గత టీడీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆ ప్రాంతంలో నిర్వహించడం, డిప్యూటీ సీఎం రాజన్నదొర దృష్టికి సచివాలయ కన్వీనర్ దొడ్డి హైమావతి రహదారి సమస్య తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 6 లక్షలు మంజూరు చేశారు. దీంతో సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నిధులు మంజూరుకు కృషి చేసిన జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇద్దరు ఎంఈఓల నియామకం

సీతానగరం: విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ విద్యాశాఖ ఇద్దరు ఎంఈఓలను మండలానికి కేటాయిస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడంతో వారు సోమవారం విధుల్లో చేరనున్నారు. ఇంతవరకూ ఎంఈఓగా విధులు నిర్వహించిన ఎంఈఓ జి.సూరిదేముడు ఎంఈఓ -1గా, పార్వతీపురం మండలం నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముప్పల వెంకటరమణను ఎంఈఓ -2గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఎంఈఓ-1 జి సూరిదేముడు మాట్లాడుతూ తాను ఇక్కడి ఎంఈఓగా దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన విద్యావిధానంతో ప్రతి కుటుంబంలో విద్యావంతులుండాలనే సంకల్పంతో ఇద్దరు ఎంఈఓలను కేటాయించినట్లు తెలియజేశారు. పాఠశాలల నిర్వహణ, నాణ్యమైన విద్యనందించడం, తరచూ పాఠశాలలను పర్య వేక్షిస్తామని ఎంఈఓలు ఇద్దరూ తెలిపారు. తమకు ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్‌లు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

ఈదురుగాలుల బీభత్సం


నేలకూలిన విద్యుత్ స్తంభాలు

వంగర: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అకస్మాత్తుగా పెద్దఎత్తున గాలులు వీయడంతో ఎం.సీతారాంపురం-వంగర గ్రామాల మధ్య ఐదు విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. ఎం.సీతారాంపురం పంట పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు మాత్రమే సరఫరా నిలిపివేసి, అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ కె.వినయ్‌కుమార్ తెలిపారు.